క్లుప్తంగా

తాగునీటి సమస్య రానీయొద్దు

ఎంపీడీఓ విశ్వప్రసాద్



మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయొద్దని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఆదేశించారు. బుధవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..గ్రామాల్లో బోరు మోటర్లతో పాటు పైప్‌లైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించి అవసరమైతే ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుశీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలను పరిరక్షించాలి

ఎంపీడీఓ డానియల్



మోత్కుపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ డానియల్ తదితరులు

బంట్వారం: నర్సరీలో మొక్కలు ఎండకుండా పరిరక్షించాలని కోట్‌పల్లి ఎంపీడీఓ డానియల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బార్వాద్, నాగసాన్‌పల్లి, మోత్కుపల్లి, జిన్నారం తదితర గ్రామాలను సందర్శించి నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వనమహోత్సవం నాటికి నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. దీనికి అవసరమైన తగు చర్యలను చేపట్టాలన్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ ఎలీషా, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుతో గ్రామాభివృద్ధి



రశీదు ఇస్తున్న ఎంపీఓ యాదయ్య

యాలాల: గ్రామ పంచాయతీల్లో సేకరించే పన్నులతో గ్రామాభివృద్ధికి అవకాశం ఉంటుందని ఎంపీఓ గాలి యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బెన్నూరులో చేపడుతున్న ఇంటి పన్ను సేకరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పన్నులు కట్టిన వారికి రశీదులు అందజేశారు. ఇంటి పన్ను వసూలుతో పంచాయతీలో అభివృద్ధి సులభతరం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తారకచారి పాల్గొన్నారు.

హస్నాబాద్‌లో స్వాముల దీక్ష స్వీకరణ

దుద్యాల్: హస్నాబాద్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, శివాలయంలో పురోహితుడు ప్రేమ్ శంకర్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 40 మంది స్వాములు మండల శివ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా స్వాములు స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. శివాష్టకం, శరణుగోశ పాడుతూ పూజలు చేపట్టారు. భక్తిశ్రద్ధలతో దీక్ష స్వీకరించి గ్రామానికి మంచి చేకూరాలని స్వామిని వేడుకున్నారు. శివరాత్రి వరకు 21 రోజుల పాటు ఈ దీక్ష నిర్వహిస్తామని స్వాములు పేర్కొన్నారు. రాజు, రమేష్, శ్రీశైలం, వెంకటేష్, రవి, మల్లేష్, సురేష్, ఎల్లప్ప, రాములు, మోహన్ దీక్ష స్వీకరించారు.

ఎస్‌ఐకి సన్మానం

దుద్యాల్: ఇటీవలే విధుల్లో చేరిన దుద్యాల్ ఎస్‌ఐ యాదగిరిని మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజన నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గిరిజన తండాల్లో పోలీసులు అంటే భయం..భయంగా ఉన్నారని, శాంతి భద్రతల విషయంలో స్నేహపూర్వకంగా విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలందిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రోటిబండ తండాకు చెందిన కృష్ణ, విజయ్, శ్రీనివాస్, కల్పేశ్, సంజయ్, సత్తర్ కుంట తండాకు చెందిన అనిల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

భారంగా సాగు..!

- పెరిగిన ఎరువుల ధరలు
- ఇబ్బందుల్లో రైతన్నలు
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలో వరిసాగు

దౌల్తాబాద్: రోజురోజుకు ఎరువుల ధరలు పెరుగుతున్నాయి. రైతులు అష్టకష్టాలోర్చి మరీ సాగుచేస్తున్నారు. ఐనప్పటికీ ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అన్నదాతలకు పంటల సాగు భారంగా మారుతుంది. ఆరుగాలం శ్రమించి పంటల సాగు చేస్తే కనీసం పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. దీంతో కొంత మంది అప్పుల పాలవుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ఎరువుల ధరలు, కూలీల ధరలు చుక్కలనంటుతున్నాయి. ధరల పెరుగుదలతో పంటల సాగుకయ్యే ఖర్చులు రెట్టింపవుతున్నాయి. దీంతో వారికి గిట్టుబాటు కావాడంలేదని వాపోతున్నారు. మండలంలో 4,800 ఎకరాల్లో వరి, 1,558 ఎకరాల్లో వేరుశనగ, 120 ఎకరాల్లో కుసుమ, 600 ఎకరాల్లో కూరగాయలు, పండ్లతోటలు సాగుచేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ధరలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో సాగుకయ్యే పెట్టుబడి వ్యయం మరింత భారమైంది.

డీజిల్ ధరల ప్రభావం..

పెట్రోలు, డీజిల్ ధరల పెంపు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పంటలసాగుపై ప్రభావం చూపుతుంది. దుక్కులు దున్నడం, పురుగుమందుల పిచికారీ, ఎరువులు, కూలీల తరలింపు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతులు పూర్తి స్థాయిలో ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. డీజిల్ ధరల పెంపుతో ట్రాక్టర్ల కిరాయిలు పెరిగాయి. మరోవైపు ఎరువుల తయారీకి వినియోగించే ముడిసరుకు ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. దీంతో కిలో ఎరువు బస్తా రూ.250నుంచి రూ.500 వరకు పెంచారు. కాంప్లెక్స్ ఎరువులపై రాయితీల తగ్గింపుతో ధరలు పెంచుతున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల ధరలు ఇలా....

ప్రస్తుతం 50కిలోల డీఏపీ ధర రూ.1,350 ఉండగా 20-20-13 ఎరువు ధర రూ.1300లకు చేరుకుంది. 14-35-14రకం రూ.1650, అదే 28-28-0రకం ఎంఓపీ రూ.1700లకు చేరింది. పంటల సాగులో ఎరువుల కంటే పురుగుమందులకే ఎక్కువ పెట్టుబడి పెడుతున్నామని సన్న, చిన్నకారు రైతులు పేర్కొంటున్నారు.

ఎరువులు కొనలేకపోతున్నాం



ఎరువుల ఖర్చు ఎక్కువవుతంది. 50కిలోల బస్తా రూ.1400నుంచి రూ.1500 వరకు ఉంది. ఎరువులకే ఎకరాకు రూ.10వేల పెట్టుబడి వస్తుంది. పురుగుమందుల ధరలు కూడా రెట్టింపయ్యాయి. ధరల పెరుగుదలతో గిట్టుబాటు కావడం లేదు. పంటల సాగు కష్టంగా మారింది.

– శివారెడ్డి, రైతు, ఈర్లపల్లి

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

ఎస్‌ఐ సంతోష్‌కుమార్



పరిగి: నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

పరిగి: దొంగతనాల నివారణకు ప్రతిఒక్కరూ తమతమ ఇళ్ల దగ్గర తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సమాజంలో నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ నేరాలను అదుపుచేయడానికి ప్రజల సహకారం అవసరమన్నారు. అనుమానస్పద వ్యక్తులు గ్రామాల్లో తిరిగినా ఎక్కడ కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. గ్రామాల్లో, ప్రతీ ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలకు పాల్పడేవారు భయపడుతారని, ఒక వేళ దొంగతనాలు జరిగితే నిందితులను గుర్తించేందుకు పోలీసులకు తేలికవుతుందన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కావున సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగవర్ధన్, వెంకటేష్, నరసింహారెడ్డి, రాకేష్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

దుద్యాల్: సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ యాదగిరి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీకు బ్యాంకు లోన్ మంజూరు చేశారని ఓటీపీలు చెప్పండని, మీ ఆధార్ కార్డు నంబర్, పాన్ నంబర్ వంటి పూర్తి వివరాలు సేకరించడానికి ప్రయత్నం చేస్తారు. అలాంటి వారి మాటలు విని సమాచారం ఇవ్వొద్దన్నారు. అలాంటి ఫోన్‌కాల్స్ వస్తే వెంటనే తిరస్కరించాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ వ్యక్తిగత సమాచారం ఎవరికీ చెప్పొదన్నారు. ఏదైనా సైబర్‌నేరం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930ను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మేరుగు వెంకటయ్య, మాజీ సర్పంచ్ ఖాజా, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, గ్రామస్తులు సత్యనారాయణ, మొగులయ్య, మోనయ్య, మల్లప్ప, రవీందర్, అంజిలయ్య, సాధిఖ్, రాములు, దస్తయ్య వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మహేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలో బీఆర్‌ఎస్ నాయకులు



కేక్ తినిపిస్తున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్

అనంత పద్మనాభ స్వామిని దర్శించుకుని పూజలు

పరిగి: పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా మహేశ్‌రెడ్డిదంపతులు అనంతరగిరిలోని అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే తన నివాసంలో తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. తరువాత పార్టీ కార్యకర్తలు గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మహేశ్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని ఆయ మండలాల నుంచి పార్టీ నాయకులు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు హరిప్రియ, పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లో విద్యుత్, ఫ్యాన్‌లు, నీటి సరఫరా ఉందా? లేదా చూసుకోవాలన్నారు. వేసవి కాలం ప్రాంభం కావడంతో గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా కాని సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితిలో నీటి సమస్య తలేత్త కుండా చూసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఆదేవిధంగా పన్నుల వసూళ్లలో జాప్యం తగదన్నారు. ఈ నెల చివరి వరకు 100శాతం పన్నులు వసూలు చేయాలని ఆమె తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, ఎంపిఓ యాదగిరి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు' తాత్కాలిక వాయిదా

బొంరాస్‌పేట: లక్ష డప్పులు తాత్కాలికంగా వాయిదా పడిందని ఎమ్మార్పీఎస్ మండల. అధ్యక్షుడు విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతుకలు, లక్ష డప్పులు, సాంస్కృతిక ప్రదన్నను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: వేల గొంతుకలు, లక్షల డప్పుల సాంస్కృతిక కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సోమశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మరమ్మతు చేయించాలి

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వారం రోజులుగా మంచినీటి బోరు పని చేయడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వారం రోజులుగా బోరు పని చేయకపోవడంతో కాలనీలో నీటి సమస్య ఎక్కువైందన్నారు. మిషన్ భగీరథ నీరు కూడా 15 రోజులుగా సక్రమంగా సరఫరా కావడంలేదన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

బంట్వారం: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏఈఓ సందీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోట్‌పల్లి మండలంలోని ఇందోల్ రెవెన్యూ గ్రామంలో గురువారం భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరిస్తారన్నారు. రైతులు తప్పనిసరిగా మట్టి నమూనాలను తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

తాండూరు రూరల్: మండల పరిధిలోని మిట్టబాసుపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. తాండూరు మండల విద్యుత్ ఏఈకి బుధవారం కలిసి వారు మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికీ సరఫరయ్యే విద్యుత్‌కు సంబంధించి ఓల్టేజ్ సమస్య తలెత్తిందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఏఈని ఆదేశించినట్లు మల్లప్ప, చిన్న నర్సిములు, జగదీష్‌లు తెలిపారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

దౌల్తాబాద్: బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, భవిష్యత్‌లో అధికారం మనదేనని, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గుండేపల్లి, దౌల్తాబాద్ గ్రామాల్లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన పార్టీ కార్యకర్తలను ఆయన పరామర్శించారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, రైతులు ఇక్కడ అష్టకష్టాలు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. రానున్న రోజుల్లో కొడంగల్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, రమేష్, భీంరెడ్డి, మల్కప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

పరిగి: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడి చేపట్టిన మాజీ సర్పంచ్‌లను, పార్టీ నాయకులను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు గ్రామ ప్రజలకు సేవలు చేసిన మాజీ సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. గ్రామాలను సొంత ఖర్చుతో అభివృద్ధి చేస్తే బకాయి బిల్లులు చెల్లించడానికి కాలయాపన చేయడం సరికాదన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి సంవత్సరంపైగా గడుస్తున్నా నేటికి మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించేంత వరకు తమ పోరాటం ఆపమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, జగన్, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సొంత పూచికత్తుపై అరెస్టయిన వారిని వదిలి వేశారు.

ఎంపీడీఓకు సన్మానం

కుల్కచర్ల: గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైన రామకృష్ణను కుల్కచర్ల మండల పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ...సంక్షేమ పథకాల అమలులో ప్రతీ ఉద్యోగి నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నక్రమంలో కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలన్నారు.

ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలి



ఉద్యమకారుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఐక్య వేదిక సభ్యులు

తాండూరు టౌన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో వీరోచితంగా పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని పలువురు ఉద్యమకారులు డిమాండ్ చేశారు. బుధవారం నియోజకవర్గ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు, 250 గజాల ఇంటి స్థలం ఇస్తానని మేనిఫెస్టోలో ఉంచిన అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా తాము సర్వస్వం కోల్పోయామని, కొందరిపై కోర్టు కేసులు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమరులైన ఉద్యమకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం అమరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు రమేష్‌కుమార్, కమాల్ అతర్, కృష్ణ ముదిరాజ్, రామకృష్ణ, సంజయ్ గౌడ్, కేశవులు, జిలాని, వాజిద్, శ్రీనివాస్ రెడ్డి, భద్రేశ్వర్, శివ, వెంకట్, మక్సూద్, బసంత్, మహేందర్ రెడ్డి, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



అఖిల భారత యాదవ మహాసభ నూతన కార్యవర్గంతో జిల్లా సభ్యులు

కొడంగల్ రూరల్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్యయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు యాదవ్‌ల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పట్టణశివారులోని శ్రీరాఘవేంద్ర ఫంక్షన్‌హాల్లో సంఘం సమావేశం ఏర్పాటుచేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ర్యాలపేట మోహన్‌రావు, అధ్యక్షుడిగా బత్తుల నర్సిములు, ఉపాధ్యక్షుడిగా గొల్ల మొగులప్ప, గొల్ల ఆంజనేయులు, గొల్ల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి నాయికోటి నర్సిములు, కార్యదర్శులుగా గొల్ల మోహన్, బుడం ఆంజనేయులు, గొల్ల చందు, కోశాధికారి అంజిలయ్యలతోపాటు 6గురిని గౌరవ సభ్యులు, 5గురిని సలహాదారులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పుర్ర రాఘవేందర్, గోపాల్, రఘు, దాసప్పయాదవ్, ఫకీరప్ప, మోహన్‌రావు, కృష్ణయ్య, నారాయణరావు, నర్సిములు, యాదగిరి పటేల్, రామకృష్ణ, మన్నె బసవరాజు, దిడ్డి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి



యాలాల: పనులను ప్రారంభిస్తున్న హన్మంతు

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సంగెంకుర్దు గ్రామాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నేత కోలుకుంది హన్మంతు పేర్కొన్నారు. బుధవారం రూ.20లక్షల ఈజీఎస్ నిధులతో సంగెంకుర్దు నుంచి సంగమేశ్వరాలయానికి వెళ్లే ప్రధాన దారిలో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడుతూ..గ్రామాభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సత్యనారాయణ, నరేందర్, శ్రీనివాస్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట: సీసీ రోడ్లకు క్యూరింగ్ తప్పనిసరని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మోమిన్‌పేటలోని చంద్రశేఖర్‌నగర్ కాలనీలో సీసీ రోడ్లు, ప్రాథమిక పాఠశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంత క్యూరింగ్ చేస్తే అన్ని సంవత్సరాలు మన్నిక ఉంటాయన్నారు. సీసీలు వేసి వదిలేయొద్దని క్యూరింగ్ తప్పకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదు



అనంతగిరి: క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతగిరి: కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదని వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు వికారాబాద్ పట్టంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో అసెంబ్లీలో ప్రవేశపెట్టినటువంటి సమగ్ర కుల గణన సర్వే బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవ ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ముత్తాహర్ షరీఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూరు టౌన్: బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని మరోసారి నిరూపితమైందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, బస్వరాజ్, మల్లికార్జున్, ఎంఏ అలీం, హబీబ్‌లాలా, పాల్గొన్నారు.

పరిగి: బీసీలకు రిజర్వేషన్ కల్పించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి, డీసీసీ ఉపాధ్యక్షుడు హన్మంతు ముదిరాజ్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చట్టసభలో 42శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల బీసీలకు రాజ్యాధికారం వస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, శ్రీనివాస్, వెంకటేష్, బాబయ్య, వెంకటయ్య, నరేష్ పాల్గొన్నారు.

యాలాల: కులగణన అనంతరం రాష్ట్ర సర్కారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు తీర్మానం చేయడం చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు చెన్నారం అనిల్‌కుమార్ గుప్తా అన్నారు. మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు గాజుల మన్నాన్, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, పాల్గొన్నారు.

కుల్కచర్ల: బడుగుబలహీనవర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం ఆమోదించడంతో కాంగ్రెస్ మండల శాఖ, దళిత సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.